క్లుప్తంగా

విద్యార్థికి ఎమ్మెల్యే సన్మానం


విజయ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన మైనార్టీ గురుకుల విద్యార్థి విజయ్‌ని గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సన్మానించారు. మండలంలోని అల్గోల్ బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ఎం.విజయ్ నీట్‌లో మంచి ర్యాంక్ సాధించాడు. ఈ మేరకు సిద్దిపేట మెడికల్ కళాశాలలో విజయ్‌కు ఉచిత సీటు వచ్చింది. ఈ మేరకు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు విజయ్‌ని సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు దేవిప్రసాద్, తన్వీర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మొహియొద్దీన్, నాయకులు ముర్తుజా, గురుకులం కళాశాల ప్రిన్సిపాల్ జమీల్, స్కూల్ ప్రిన్సిపాల్ రాములు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు


జేసీబీతో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

జహీరాబాద్ టౌన్: కలెక్టర్ శరత్ ఆదేశాల మేరకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ గురువారం జహీరాబాద్ పట్టణంలో పర్యటించి కాలువలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను మున్సిపల్ అధికారులతో కలిసి కూల్చివేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి మాట్లాడుతూ మురుగు కాలువలపై నిర్మాణాలు చేపట్టినా, కబ్జాచేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నారాయణఖేడ్: ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జీ కోర్టులో ఈ నెల 9న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి శ్రీధర్ మంథాని అన్నారు. ఈ మేరకు నారాయణఖేడ్‌లోని కోర్టుహాల్‌లో గురువారం సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఖేడ్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు పనులు ప్రారంభం

నారాయణఖేడ్: మండల పరిధిలోని మూడు గుంటల చౌరస్తా సమీపంలో కల్వర్టు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. చౌరస్తా నుంచి సంజీవన్‌రావుపేట్, కద్పల్, సిర్గాపూర్‌ల మీదుగా చాప్టా(కె) వెళ్లే ఖేడ్–కంగ్టి రహదారికి అనుసంధానంగా రహదారి ఉంది. అనేక ప్రాంతాల వారికి రాకపోకలు సాగించేందుకు దగ్గరిదారిగా ఉండటంతో ఈ మార్గంలో వాహనాల రద్దీ ఎక్కువే. కాగా మూడుగుంటల చౌరస్తా వద్ద కల్వర్టు లేకపోవడంతో వర్షాకాలాల్లో వాగునీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండటంతో రూ.10లక్షలతో కల్వర్టు పనులు చేపట్టారు. కల్హేర్ జెడ్పీటీసీ నర్సింహారెడ్డి సందర్శించి పనులు పర్యవేక్షించారు.

నీలం మధుకు మద్దతు

పటాన్‌చెరు టౌన్: బీసీ వర్గానికి చెందిన నీలం మధుకు పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల గ్రామంలో బీసీ వర్గాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీలం మధు బీఆర్‌ఎస్ బలోపేతంలో ఎంతో కృషి చేశాడన్నారు. అయినప్పటికీ సీఎం కేసీఆర్ గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే నీలం మధును స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయించి అసెంబ్లీకి పంపుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగయ్య, ఊట్ల మహేష్, నర్సింలు, రమేష్, ముత్యాలు, నాగభూషణం పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సదాశివపేట(సంగారెడ్డి): సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మాజీ అధ్యక్షుడు అనిల్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఉజ్వల జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ప్లీనరీ సమావేశాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఉద్యమిస్తోందన్నారు. ప్లీనరీ సమావేశాలకు మేధావులు, విద్యార్థులు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రాఘువేందర్‌రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రజనీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి


నారాయణఖేడ్: ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


పటాన్‌చెరు టౌన్: కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు

జిల్లావ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు రాధాకృష్ణుడి వేషాధారణలతో అలరించారు. పలు దేవాలయాలు భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


రామచంద్రాపురం: భెల్‌లోని ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సదాశివపేట: సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో..


సంగారెడ్డి టౌన్‌లో..


సంగారెడ్డి టౌన్: రాధాకృష్ణ వేషాధారణలో..


ఝరాసంగంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు


జహీరాబాద్: గొల్ల, కురుమ యాదవ సంఘం ఆధ్వర్యంలో..


హత్నూర: దేవులపల్లిలో..

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం


నారాయణఖేడ్: పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేశ్ షెట్కార్ అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా నారాయణఖేడ్‌లో గురువారం కాంగ్రెస్, అనుబంధ సంఘాల శ్రేణులతో పట్టణంలో భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్, రాజీవ్‌చౌక్‌ల మీదుగా మహాత్మాగాంధీ చౌక్‌వరకు పాదయాత్ర నిర్వహించి మహనీయుల విగ్రహాలకు నివాళులర్పించారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు సాగర్ షెట్కార్, శంకర్, తాహెర్ అలీ, వినోద్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌చెరు టౌన్‌లో..

పటాన్‌చెరు టౌన్: రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర సంవత్సరం పూర్తయిన సందర్భంగా పటాన్‌చెరు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, నాయకులు కుంచాల కిషన్, యువరాజ్, కృష్ణ, శీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

మనూరులో..

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కిలోమీటర్ వరకు పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్‌రావు పాటిల్, నాయకులు బైండ్ల నారాయణ, శంతతప్ప, సాగర్, నర్సింహారెడ్డి, విద్యాసాగర్, రాజు, సంగమేశ్వర్, నగేష్‌గౌడ్, శివకుమార్, షఫి, మాణిక్యం, వెంకట్‌రెడ్డి, తుకారాం పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

రాయికోడ్(అందోల్): కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జోడోయాత్ర చేపట్టి ఏడాది ముగిసిన సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలంలోని నాగ్వార్ గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

మునిపల్లి నుంచి ఖమ్మంపల్లి వరకు ర్యాలీ

మునిపల్లి(అందోల్): భారత్ జోడో యాత్రకు ఏడాది పూర్తయిన సందర్భంగా మండల కేంద్రమైన మునిపల్లి నుంచి ఖమ్మంపల్లి చౌరస్తావరకు మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర నర్సింహ్మా, ఆయన కుతురు త్రిష పాదయాత్ర నిర్వహించారు. మాజీ ఎంపీపీలు రాంరెడ్డి, రాజేశ్వర్‌రావు, మునిపల్లి మాజీ ఎంపీటీసీ మంతూర్ సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సతీష్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

జహీరాబాద్ టౌన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన అర్జున్ చవాన్‌ను గురువారం సన్మానించారు. మొగుడంపల్లి మండలం పడియాల్ తండాకు చెందిన అర్జున్‌చవాన్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నిక కాగా టీచర్స్‌డే సందర్భంగా అవార్డు అందుకున్నారు. మండల కేంద్రమైన మొగుడంపల్లిలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు విజయమోహన్‌రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో టీబీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తులసీరాం రాథోడ్, నాయకులు రూప్‌సింగ్, మారుతి నాయక్, మధు, మున్నునాయక్ పాల్గొన్నారు.

నేడు చెరకు రైతుల సమావేశం

జహీరాబాద్: ఈ నెల 8వ తేదీన సాయంత్రం 4 గంటలకు జహీరాబాద్‌లో చెరకు రైతుల సమావేశం నిర్వహించనున్నట్టు రైతు సంఘం నాయకుడు కొండల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పీవీఆర్ గార్డెన్‌లో నిర్వహించే సమావేశంలో చెరకు రైతులు, ట్రైడెంట్ కర్మాగారం కార్మికుల సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్టు పేర్కొన్నారు. అందరి అభిప్రాయాల మేరకు ఉద్యమ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. రైతులు, స్థానిక నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని వెంకటాపూర్ హనుమాన్ మందిర్ ఆలయ నిర్మాణానికి గురువారం పట్నం మాణిక్యం ఫౌండేషన్ సభ్యులు పట్నం రవితేజ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

◆ **నిరుపేదల అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిరుపేదలకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉందని మాజీ రాష్ట్ర శాసనమండలి ప్రొటెమ్ చైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి అన్నారు. గురువారం భారతినగర్ డివిజన్ పరిధిలో పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను కార్పొరేటర్ సింధు ఆదర్శ్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. నాయకులు కుమార్‌గౌడ్, ఆదర్శ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, పరమేష్‌యాదవ్, పాల్గొన్నారు.

◆ **లైసెన్స్‌లు అందజేత**

రాయికోడ్(అందోల్): మండల కేంద్రంలోని యువకులకు ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బసవరాజ్ పాటిల్ అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ విఠల్, మండల నాయకులు శంకర్, తుకారాం, సంగమేశ్వర్‌పాటిల్, మహిపాల్‌రెడ్డి, మల్లేశం, సద్దామ్ పాల్గొన్నారు.

◆ **రైతుబీమా చెక్కు అందజేత**

నారాయణఖేడ్: అన్నివర్గాల సంక్షమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. క్యాంపు కార్యాలయంలో గురువారం బాణాపూర్‌కు చెందిన బేతమ్మకు రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5లక్షల చెక్కును అందజేశారు. అదేవిధంగా కారాముంగి, గోసాయిపల్లి, తుర్కాపల్లి, సుల్తానాబాద్ గ్రామాల్లోని ఆలయాల పూజారులకు దీపధూపనైవేద్య పథకం ద్వారా పూజారులకు అనుమతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, ఎంపీటీసీ రమేష్, జంగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

◆ **సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న ఆల్ ఇండియా తెలుగ, కాపు, బలిజ సంఘం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు విడుదల చేయడం ఆనందంగా ఉందని ఆల్ ఇండియా తెలుగా, కాపు, బలిజ భవన నిర్మాణ కమిటీ కన్వీనర్ అరవ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు రామకృష్ణను గురువారం ఆయన నివాసంలో కాపు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక నిధులు కేటాయించిన సీఎం కేసీఆర్‌కు కాపు సంఘం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ **ఆర్థికసాయం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లికి చెందిన రమేశ్, రాంచంద్రయ్య ఇటీవల మరణించటంతో వారి కుటుంబాలకు ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి రూ.10వేల చొప్పున ఇద్దరి కుటుంబాలకు రూ.20వేలను అందజేశారు.

◆ **రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టొద్దు**

జిన్నారం(పటాన్‌చెరు): సోషల్‌మీడియాలో చేస్తున్న పోస్టులు ఇతరులను రెచ్చగొట్టేలా ఉండొద్దని జిన్నారం ఎస్‌ఐ విజయారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల, మతాలు, ఇతర వ్యక్తులు, పార్టీల మీద సోషల్‌మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ **గండి పూడ్చే పనులు ప్రారంభం**

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలంలోని సజ్జరావుపేట తండా పీర్లగుట్ట చెరకువుకు పడిన గండిని పూడ్చడానికి ఇరిగేషన్‌శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారు. బుధవారం జహీరాబాద్‌కు వచ్చిన కలెక్టర్ శరత్ చెరువు పరిస్థితి తెలుసుకున్నారు. చెరువుకు పడిన గండిని పూడ్చాలని ఆదేశాలు జారీ చేయగా గురువారం ఇరిగేషన్‌శాఖ అధికారులు గండి పూడ్చే పనులు ప్రారంభించారు.

◆ **నందికందిలో పౌష్టికాహార వారోత్సవాలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని నందికంది అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

◆ **రాబోయే ఎన్నికల్లో సత్తా చాటుతాం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రానున్న ఎన్నికల్లో తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో తమ సత్తాను చాటుతామని తెల్లాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిలకమర్రి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లాపూర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ శక్తివంతంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తామని తెలిపారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముక్కెర రమేష్ పాల్గొన్నారు.

◆ **అతిగా మద్యం తాగి వ్యక్తి మృతి**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఖాజీపల్లి గ్రామ శివారులో నిలిచిన వర్షం నీటిలో పడి వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టిన పోలీసులు మృతుడి వివరాలను గురువారం వెల్లడించారు. సీఐ నయీముద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లాకు చెందిన ప్రభాకర్(45) బొల్లారంలో ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ఇటీవల భార్యాభర్తలు గొడవ పడ్డారు. దీంతో ప్రభాకర్ భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్తాపానికి గురైన ప్రభాకర్ అతిగా మద్యం తాగి నడుచుకుంటూ నిల్వ ఉన్న వర్షంనీటిలో పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ తెలిపారు.

సర్వాయి జీవితం ఆదర్శం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సర్దార్ సర్వాయి పాపన్న జీవితం భావితరాలకు ఆదర్శనీయమని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో గీత పారిశ్రామిక సహకార సంఘం వెలిమల గ్రామకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాటి మొగల్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి 33 కోటలను జయించిన గొప్ప బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని కొనియాడారు. సాకి చెరువు కట్టపై త్వరలోనే పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించనున్న రేణుకాఎల్లమ్మ తల్లి ఆలయం భూమిపూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, కౌన్సిలర్లు రవీందర్‌రెడ్డి, సుచరితకొమరయ్య, శ్రీశైలం, బాలాజీ, నాయకులు సోమిరెడ్డి, ఉమేష్, మాజీ సర్పంచ్ రాజ్యం మహిపాల్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మల్లారెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రూపశ్రీ కాలనీకి చెందిన గరాటరెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే ద్వారా సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా మంజూరైన రెండున్నర లక్షల ఎల్‌ఓసీని గురువారం గరాటరెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చంద్రశేఖర్ ఉన్నారు.

ఎమ్మెల్యేకు మంగ్లీ పరామర్శ



పటాన్‌చెరు: ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి అకాల మరణం పట్ల ప్రముఖ గాయని మంగ్లీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలోని ఎమ్మెల్యేను పరామర్శించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎమ్మెల్యే సోదరుడు మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నాయకులు చెన్నారెడ్డి పాల్గొన్నారు.

గొల్ల, కురుమల అభ్యున్నతికి కృషి


మనూరు: పుల్‌కుర్తిలో గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి


సదాశివపేట(సంగారెడ్డి): గొర్రెలు పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

మనూరు(నారాయణఖేడ్): గొల్ల, కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మనూరు, నాగల్‌గిద్ద మండలాల్లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం పర్యటించి లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేనన్ని సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దిక్కిందన్నారు. అనంతరం పుల్‌కుర్తిలో చర్చి కంపౌండ్‌వాల్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, అంబారెడ్డి, సర్పంచ్ కవిత, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ..

సదాశివపేట(సంగారెడ్డి): గొల్ల, కురుమల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని సిద్ధాపూర్‌లో గొల్ల,కురుమలకు 12 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్ల, కురుమలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విద్యాసాగర్‌రెడ్డి, కోఆప్షన్‌మెంబర్ కోదూరి అంజయ్య, పశు వైద్యాధికారి కళ్యాణి, బీఆర్‌ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు చీలమల్లన్న, పెద్దగొల్ల ఆంజనేయులు, ఎంపీటీసీ సునీతాసుధాకర్, సర్పంచ్‌లు సలావుద్దిన్, సిద్దన్న, మాజీ ఎంపీటీసీ అశోక్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

పటాన్‌చెరు టౌన్: ప్రజావ్యతరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రాబోయే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలో నిత్యావసరాల సరకుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి తుంగలో తొక్కిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సీపీఎం ఏరియా కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, జార్జ్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో నిరసన

సదాశివపేట(సంగారెడ్డి): బడా పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తోందని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. ఆ పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు గురువారం పట్టణంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు భూషణం, అనిల్, ఏసోబు, మోహన్, తిరుపతి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

పటాన్‌చెరు టౌన్: గుమ్మడిదల మండల కేంద్రంలో ఇటీవల వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన సుధాకర్ మృతికి రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ బాధ్యత వహిస్తూ వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్‌లో ఆ పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేవేందర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి బైండ్ల కుమార్, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు కావలి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజుల హక్కులను కాపాడుకుందాం


వట్‌పల్లి(అందోల్): ముదిరాజుల హక్కులను కాపాడుకుందామని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సపాన్‌దేవ్ ముదిరాజు పిలుపునిచ్చారు. గురువారం కొర్వి కృష్ణస్వామి జయంతి సందర్భంగా వట్‌పల్లిలో ముదిరాజ్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు టప్ప కుమార్, రాష్ట్ర ముదిరాజ్ మహాసభ పొలిట్‌బ్యూరో సభ్యుడు నారాయణ, మండల అధ్యక్షుడు భాగయ్య, మత్స్యశాఖ మాజీ డైరెక్టర్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొర్వి కృష్ణస్వామి విగ్రహావిష్కరణ

నారాయణఖేడ్: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ముదిరాజ్ భవన్ వద్ద కొర్వి కృష్ణస్వామి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాన్ని హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్, విగ్రహాదాత ఆగంపందు ఆవిష్కరించారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సభను ఏర్పాటు చేసి కొర్వి కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పించారు. అంతకుముందుకు భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘం బాధ్యులు రామకృష్ణయ్య, అల్కారి సత్యనారాయణ, పత్తిరి రామకృష్ణ, శంకర్ ముదిరాజ్, నగిరేశం, శ్రీనివాస్, రాజగిరి శ్రీనివాస్, పుండ్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజు నాయకుల భారీ ర్యాలీ

హత్నూర(సంగారెడ్డి): హైదరాబాద్ మొదటి మాజీ మేయర్, రచయిత, సీనియర్ జర్నలిస్టు సామాజికవేత్త, కొరివి కృష్ణస్వామి జయంతి హత్నూర మండలంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం దౌల్తాబాద్‌లో తెలంగాణ తల్లి చౌరస్తా నుంచి కాసాల చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆంజనేయులు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజేందర్, సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దిగంబర్, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.


దౌల్తాబాద్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు